క్లుప్తంగా

పెద్దదోర్నాల తహసీల్దార్‌గా శాంతి


తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కిన్నెర శాంతి

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్దదోర్నాల తహసీల్దార్‌గా కిన్నెర శాంతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సమయంలో ఇక్కడ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన షేక్ హమీద్ నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. పొదిలిలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ అడహాక్ తహసీల్దార్‌గా పదోన్నతిపై కిన్నెర శాంతి ఇక్కడ నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన శాంతి మాట్లాడుతూ మండలంలో నెలకొన్న భూ సమస్యలను తొలగించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తహసీల్దార్ శాంతికి శుభాకాంక్షలు తెలిపారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన


బాలికలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సునీత

దొనకొండ: స్థానిక కస్తూరిబా గాంధీ గురుకుల బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వైద్యాధికారి కె.సునీత అవగాహన కల్పించారు. పాఠశాలలో గురువారం కిశోర బాలిక ఫ్రెండ్లీ హెల్త్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సునీత పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు నేరమని, బాల్య వివాహాలతో కలిగే నష్టాలు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలిపారు. బాలికలకు ఆరోగ్యపర విషయాలు తెలియజేశారు. ప్రత్యేకాధికారి మమత, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే వైద్యులపై దాడులకు దిగినా అఘాయిత్యాలకు పాల్పడిన నేరస్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. ప్రత్యేక చట్టం తీసుకొచ్చి వైద్యుల్లో ఆత్మస్థైర్యం నింపాలి.

– కె.లక్ష్మీనరసింహ, ప్రభుత్వ వైద్యాధికారి, పుల్లలచెరువు



మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలి


మహిళా డాక్టర్లకు భద్రత కల్పించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. చాలా మంది వైద్యశాలలకు మద్యం తాగి వస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటే చాలా మంచిది. పోలీస్ సిబ్బంది రాత్రి, పగలు వైద్యశాలకు వచ్చి వెళ్లాలి. సిబ్బందికి ధైర్యం చెప్పాలి.

– కె.సునీత, వైద్యాధికారి, దొనకొండ



కాలం చెల్లిన విద్యుత్ లైన్లు, స్తంభాలు


శిథిలమైన విద్యుత్ స్తంభం


అతుకులతో విద్యుత్ తీగలు

పుల్లలచెరువు: కాలం చెల్లిన విద్యుత్ లైన్లు, స్తంభాలతో పుల్లలచెరువులో ప్రమాదం పొంచి ఉంది. పుల్లలచెరువులో ఎప్పుడో దశాబ్దాల కాలంలో ఏర్పాటు చేసిన స్తంభాలు నేడు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు కూలిపోతాయో అన్నట్లు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల విద్యుత్ తీగలు కిందకు ఒంగి ఒకదానికొకటి తగులుకుని మంటలు వస్తున్నాయి. తెగిన తీగలకు ఇప్పటికి అనేక సార్లు జాయింట్లు వేశారు. గాలి వీచినప్పుడు తీగలు రాసుకుని మంటలు వస్తున్నాయి. గ్రామంలో అనేక చోట్ల తీగలు, స్తంభాల పరిస్థితి ప్రమాదకరంగానే ఉంది. గతంలో విద్యుత్ తీగలు తెగి అటుగా వెళ్తున్న గారపెంట బస్సుపై పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రమాదాలు జరిగితే తప్ప అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారులకు గ్రామ ప్రజలు అనేకసార్లు గ్రామంలో విద్యుత్ స్తంభాలు, లైన్లు, తీగలను మార్చాలని కోరారు. అధికారులకు తెలియజేశాం.. అని చెబుతారేగానీ వాటిపై సమగ్ర విచారణ చేసి వాటిని మార్చకుంటే ప్రమాదాలు తప్పవని ఆలోచన ఎందుకు చేయడం లేదనేది ప్రశ్న.

అధికారులు చర్యలు చేపట్టాలి



పుల్లలచెరువులో విద్యుత్ లైన్లు, స్తంభాల పరిస్థితి దారుణంగా ఉంది. ఎప్పుడో వందల సంవత్సరాల నాటి స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. విద్యుత్ తీగల పరిస్థితి కూడా అంతే. గ్రామంలో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. అధికారులు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని మెల్కోకపోతే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎల్.రాములు, పుల్లలచెరువు

నెలాఖరుకు 80 కోట్ల మొక్కలు నాటాలి


కేవీకేలో మొక్కలు నాటుతున్న కేజీబీవీ విద్యార్థినులు

దర్శి: వచ్చే నెల చివరకు దేశవ్యాప్తంగా 80 కోట్ల మొక్కలు నాటే విధంగా భారత ప్రభుత్వం చేపట్టిన గ్లోబల్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ జి. రమేష్ తెలిపారు. స్థానిక కేవీకేలో కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ రమేష్ మాట్లాడుతూ 2025 మార్చి నాటికి 140 కోట్ల మొక్కలు భారతదేశ వ్యాప్తంగా నాటాలని ప్రభుత్వం ఆదేశాలన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటుకుంటే మంచి ఆక్సిజన్ లభిస్తుందని, అదేవిధంగా వాతావరణంలో సమతుల్యతను కాపాడుకోవచ్చన్నారు. ఓజోన్ పొర క్షీణతను అరికట్టేందుకు మొక్కలు నాటడం మంచి ఉపయోగకరం అన్నారు. కేవీకే సిబ్బంది, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వధూవరులకు బూచేపల్లి ఆశీర్వాదం


తాళ్లూరులో కంభంపాటి బాబు వివాహానికి హాజరైన బూచేపల్లి వెంకాయమ్మ


తానంచింతలలో సురేష్ వివాహంలో..

దర్శి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ గురువారం నియోజకవర్గంలో వివిధ శుభ కార్యాలకు హాజరయ్యారు. తాళ్లూరులో కంభంపాటి బాబు వివాహానికి హాజరయ్యారు. మండలంలోని తూర్పు చౌటపాలెంలో గృహప్రవేశానికి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తానంచింతలలో సురేష్ వివాహానికి హాజరై నూతన వధూవరులకు అక్షతలు వేసి ఆశీర్వదించారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం


దొనకొండ: సన్మానం అందుకుంటున్న నరసింహారావు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి తదితరులు క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమూర్తి, ఫిజికల్ డైరెక్టర్లు పి.రామానాయక్, హెచ్.రామానాయక్, విజయ మాణిక్యం, అనసూయాదేవి, కిరణ్‌కుమార్, పోలయ్య, మీతేనాయక్ పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం

దొనకొండ: స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు దొనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ గేమ్స్‌లో 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు అందించే స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు ప్రకాశం జిల్లాలో 5 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో భాగంగా దొనకొండ పాఠశాల 2వ స్థానంలో ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నరసింహారావు తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం డైట్ కళాశాల మైనంపాడులో ఎంపికైన పాఠశాలల ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి వ్యాయమ ఉపాధ్యాయులు నరసింహారావు హాజరయ్యారు. సంతనూతలపాడు ఎంఈఓ డి.వెంకటరెడ్డి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావులు నరసింహారావును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి బొకే అందజేశారు. అనంతరం సర్టిఫికెట్ ప్రదానం చేశారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె.వనిజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పెద్దదోర్నాలలో క్రీడాజ్యోతితో ఉపాధ్యాయులు


వై.పాలెంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవోలు


గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయినులు

స్వచ్ఛత, మాధుర్యమే తెలుగుభాష

పుల్లలచెరువు: పాలలో ఉన్న స్వచ్ఛత, తేనేలో ఉన్న మాధుర్యం కలగలిపిన పదజాలమే తెలుగుభాష.. అని కేజీబీవీ ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి అన్నారు. గురువారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి రామ్మూర్తి పంతులు ఎనలేని కృషి చేశారన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగు మట్లాడటంతో పాటు పిల్లలకు తెలుగుభాష గొప్పతనాన్ని తెలియచేసి వారు తెలుగు భాషలో సంభాషించేలా చేయడమే వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులుకు ఇచ్చే గౌరవమన్నారు. తెలుగు భాష అందాన్ని తెలియచేసిన మహనీయుడు, బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది, రావు సాహెబ్ బిరుదు పొందారని, కళా ప్రపూర్ణ పురస్కార గ్రహీత ఈయన జయంతినే తెలుగు భాషా దినోత్సవంగా ఆచరిస్తారన్నారు. ఓ విద్యార్థి వేసిన తెలుగు తల్లి వేషధారణ ఆకట్టుకుంది.

పెద్దదోర్నాల: మండల వ్యాప్తంగా పలు పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సావిత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గిడుగు రామ్మూర్తి గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు జ్యోతిని ఘనంగా సత్కరించారు. మండలంలోని చిన్నదోర్నాల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

ముండ్లమూరులో.. వ్యవహారిక భాషా పితామహునిగా పేరొందిన గిడుగు వెంకట రామ్మూర్తి తెలుగు భాషకు గొడుగుపట్టారని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు షేక్ హజరత్ అలీ అన్నారు. మండల కేంద్రం ముండ్లమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు నరసింహారావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన వేడుకల్లో ముందుగా గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం షేక్ హజరత్ అలీ తెలుగు బాషాభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు తనవంతు కృషి చెయ్యాలన్నారు. భాషా నైపుణ్యాలకు పెంచటానికి విద్యార్థులకు సరైన తర్ఫీదు ఇవ్వాలన్నారు. గిడుగు రామ్మూర్తి జీవిత సంఘటనలు తెలుగుభాష కోసం ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఎస్ఆర్ కోటేశ్వరరావు, జి.భావన్నారాయణ, ప్రభాకర్, ఆంజనేయులు చక్రపాణి, ఆర్. శ్రీనివాసరావు, భారతి, ప్రణతి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వేంకట రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్విజ్ పోటీల విజేతలకు ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లు నాయక్ బహుమతులు అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.పిచ్చిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు, క్రీడా ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. ప్రముఖ కవి దేవులపల్లి విశ్వనాథం రచించిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. మండలంలోని వీరభద్రాపురం పాఠశాల హెచ్ఎం మంత్రూనాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తెలుగు పండితులు, క్రీడా కారుల వేశాధారణలో ఆకట్టుకున్నారు.


ముండ్లమూరు: గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు


పెద్దదోర్నాలలో తెలుగు అధ్యాపకురాలిని సత్కరిస్తున్న డిగ్రీ కళాశాల సిబ్బంది

18 ఏళ్లలోపు బాలికలకు పెళ్లి చేయవద్దు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

తాళ్లూరు (దర్శి): 18 ఏళ్లలోపు అమ్మాయిలకు పెళ్లి చేయరాదని ప్రభుత్వ వైద్యురాలు కె.మౌనిక అన్నారు. తూర్పుగంగవరం జెడ్పీ హైస్కూల్లో కౌమారదశ బాలికలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ విద్యార్థుల ఆటలు, పాటలు, దినచర్యలు గురించి వివరించారు. ఆహారపు అలవాట్లు, పౌష్టికాహారం గురించి తెలియజేశారు. తక్కువ వయసులో వివాహాలు చేసుకుంటే కాన్పులు కష్ట సాధ్యమవుతాయని, బిడ్డలు బలహీనంగా పుడతారని చెప్పారు. ఎంఈఓ చంద్రశేఖర్‌బాబు, పీహెచ్ఎస్ ఎస్‌కే మస్తాన్‌వలి, వి.సుశీల పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేస్తే చట్టరీత్యా నేరం

ముండ్లమూరు (దర్శి): బాల్యవివాహలు చేస్తే చట్టరీత్యా నేరమని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి జంగా వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్ర కిశోర స్వచ్ఛ అనే కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులు తినే ఆహారంలో పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. అలా తీసుకుంటే అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అనారోగ్యంగా ఉన్నప్పుడు వెంటనే మీ దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యులను సంప్రదించి వైద్యసేవలు పొందాలన్నారు. విద్యార్థులు మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. యుక్త వయస్సులో ఉన్నప్పుడు ముందుకు ఎలాపోవాలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. చిన్న వయసులో చెడు వ్యసనాలకు బానిసలు కావద్దన్నారు. ఎవరికైనా రక్తహీనత ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి హెచ్‌బీ టెస్ట్ చేయించుకుని మందులు వాడాలన్నారు. ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు వయస్సు వచ్చేంత వరకు వివాహాలు చేయరాదన్నారు. ఎవరైనా అలా చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

జీజీహెచ్‌లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి


నాడు.. ఆస్పత్రి ఆవరణలో నిలిచి ఉన్న వర్షం నీరు


నేడు.. మురుగు గుంతను పూడ్చుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్‌లో పారిశుధ్యం మెరుగుపరుస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ పి.సావిత్రి పేర్కొన్నారు. జీజీహెచ్‌లో అధ్వానంగా ఉన్న పారిశుధ్యంపై ఈ నెల 24న 'సాక్షి'లో ''సమస్యల రొద.. రోగుల వ్యథ'' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించి చర్యలు చేపట్టారు. గురువారం ఆమె వైద్యశాల ఆవరణ మొత్తం తిరిగి సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మురుగు గుంటలను మట్టితో పూడ్చించి నీరు నిల్వలేకుండా చేశారు. కాలువల్లో మురుగు సాఫీగా పోయేందుకు చర్యలు చేపట్టారు.

పెద్దదోర్నాలలో మినీ థియేటర్ ప్రారంభం

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్దదోర్నాలలో గురువారం మినీ సినిమా థియేటర్ ప్రారంభమైంది. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండల కేంద్రంలో ఓ టూరింగ్ టాకీసు ఉండేది. మండల ప్రజలకు అప్పట్లో అదే వినోదాన్ని అందించే సాధనం. అది శిథిలావస్థకు చేరినప్పటి నుంచి ఎవరూ థియేటర్‌ను నిర్మించలేదు. నూతనంగా నిర్మించిన ఈ థియేటర్‌తో కొంగొంత సినిమాలు చూసే అవకాశం ఉండటంతో మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు నల్లమల ఘాట్‌లో శ్రీశైలానికి ప్రయాణంపై నిషేధం ఉండటంతో యాత్రికులు ఇక్కడే వేచి ఉండాల్సి ఉంటుంది. దీంతో రాత్రి వేళ్లల్లో 9 గంటల తర్వాత ఆలస్యంగా వచ్చిన ప్రతి వాహనం మండల కేంద్రంలో నిలిచి పోవాల్సిందే. దీంతో అటువంటి ప్రయాణికులకు సినిమా థియేటర్ ఎంతో ఉపయోగకరంగా మారనుంది.



పెద్దదోర్నాలలో ప్రారంభమైన నూతన థియేటర్